GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 246 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 05-03-2025 | పేజీలు : 3

## ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్

### నోటీసులు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశం

**టీ మీడియా, మార్చి 4, ఢిల్లీ:**



పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో ఇవాళ విచారణ జరిగింది. ఈ కేసులో ఇప్పటివరకు తమకు నోటీసులు రాలేదన్న ప్రతివాదుల న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకురావడంతో వారందరికి నోటీసులు జారీ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి సహా ప్రతివాదులందరికీ నోటీసులు ఇవ్వాలని అందులో సూచించారు.బీఆర్?ఎస్? నేతలు కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో జరిగిన విచారణ జరిగింది. ప్రతివాదుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, వారికి నోటీసులు అందలేదని గుర్తించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి సహా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు పంపనున్నారు. దీనిపై ఈనెల 25లోపు కౌంటర్లు దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తూ, అదే రోజుకు విచారణను వాయిదా వేసినట్లు తెలిపింది.

# ప్రాణ స్నేహితుడికి ప్రమోషన్.. !

- వ్యూహాత్మకంగా ఎమ్మెల్సీకి అడుగులు
- 2015లో ప్రారంభమైన కథ

**టీ మీడియా, మార్చి 4, హైదరాబాద్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకోబోతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ ఎన్నిక వెనుక ఉన్న కథను చూస్తే, ఇది కేవలం ఒక ఎమ్మెల్సీ పదవి కోసం జరిగే పోటీ కాదనిపిస్తుంది. కొన్ని దశాబ్దాల క్రితం ప్రారంభమైన స్నేహం, అరెస్టులు, రివెంజ్ ల సమాహారంగా కనిపిస్తోంది.

**2015లో ప్రారంభమైన కథ**

2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 'ఓటుకు నోటు' కేసు సంచలనం సృష్టించింది. అప్పుడు రేవంత్ రెడ్డి తెలుగు దేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా ఉండగా, వేం నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేయడం జరిగిందనే ఆరోపణలతో కేసు నమోదైంది. ఆ ఘటనలో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారు. వేం నరేందర్ రెడ్డి రాజకీయంగా వెనుకబడ్డారు. అయితే, రాజకీయ సమీకరణాలు మారిన తర్వాత రేవంత్ కాంగ్రెస్‌లో చేరగా, వేం నరేందర్ రెడ్డి కూడా అదే బాటలో నడిచారు. అప్పటి నుంచి వేం నరేందర్ రెడ్డి %-% రేవంత్ రెడ్డికి నీడలా ఉండి ఆయన్ని అనుసరించారు.ఆ తర్వాత మారిన పరిణామాలతో కాంగ్రెస్ లో చేరిన రేవంత్ వేంటే వేం కూడా చేరారు. అప్పటి నుండి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పుడు ముఖ్యమంత్రి ఈ కాలంలో మొత్తం రేవంత్ వేంటే నీడై నడిచారు వేం నరేందర్ రెడ్డి. కనీసం ఎమ్మెల్యే టిక్కెట్ కూడా అడగకుండా ఎన్నికలను దగ్గరుండి రేవంత్ యాక్షన్‌ను ప్లాన్ చేశారు. ఈలోపే ఎన్నికలు వచ్చాయి సీఎంగా రేవంత్ రెడ్డి భాద్యతలు చేపట్టారు.ఇక రేవంత్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేం నరేందర్ రెడ్డి చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే



వేం నరేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి సలహదారుగా నియమించారు. అప్పటి నుండి పార్టీతోపాటు, ప్రభుత్వ కార్యకలాపాలు, సీఎం యాక్టివిటి అంత వేం నరేందర్ రెడ్డి అన్ని తానై చూసుకుంటున్నారు. ఇక ఇప్పుడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిపికేషన్ రావడంతో ఇప్పుడు అందరి చూపు వేం వైపు మళ్లింది.అయితే తాజాగా తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్ఎసకు వెళ్లే అవకాశముండగా, నాలుగింట్లో కాంగ్రెస్ పార్టీ పాగా వేయనుంది. దీంతో ఇప్పుడు స్నేహం కోసం అనే మాట మళ్లీ వినిపిస్తుంది. 5 ఎమ్మెల్సీలలో నాలుగు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీకి రానున్నాయి. దీంతో ఇప్పుడు ఒక ఎమ్మెల్సీని వేం నరేందర్ రెడ్డికి ఇవ్వడం పక్కా అనే ప్రచారం జరుగుతుంది. వేం నరేందర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి పెద్దల సభకు పంపడం ఖాయంగా కనిపిస్తోంది.

**అదే ఎమ్మెల్సీ సీటుతో రివేంజ్ ప్లాన్?**

తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడటంతో, కాంగ్రెస్ తన అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేసింది. ఈసారి కాంగ్రెస్‌కు నాలుగు స్థానాలు రావడం ఖాయమని రాజకీయ వర్గాలు అంచనా వేస్తుండగా, వేం నరేందర్ రెడ్డి పేరును ఖరారు చేసే అవకాశముంది. దీనివల్ల ఒకప్పుడు జరిగిన అన్యాయాన్ని సరి చేయడంతో పాటు, అప్పటి కేసుకు కారణమైన ఎమ్మెల్సీ సీటును ఇప్పుడే దక్కించుకోవడం ద్వారా, ఒక విధంగా రివేంజ్ తీర్చుకుంటున్నట్లవుతుందని చర్చ జరుగుతోంది.

**వేం నరేందర్ రెడ్డికి మంత్రి పదవి?**

ఎమ్మెల్సీగా వేం నరేందర్ రెడ్డిని పంపించడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఆయనకు మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం కూడా ఉందన్న ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఆయనకు ప్రభావశీలమైన శాఖ కట్టబెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా కాంగ్రెస్ వ్యూహం రూపొందిస్తుండటంతో, ఆయనకు ఈ ఎన్నికలో అవకాశం దక్కే అవకాశాలు మరింత పెరిగాయి.

**రాజకీయంగా కీలక దశలో నిర్ణయం**

ఇప్పటికే వేం నరేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి సలహాదారుగా నియమించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే, సామాజిక వర్గాల సమీకరణం, ఇతర పార్టీల ప్రతిపాదనలు, టీపీసీసీ నేతల అభిప్రాయాలు వంటి అంశాల ఆధారంగా ఆఖరి నిర్ణయం తీసుకోనున్నారు.

త్వరలోనేతుది నిర్ణయం

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు ప్రక్రియ వేగంగా సాగుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు అభ్యర్థుల ఎంపికపై చర్చిస్తున్నారు. అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపిన తర్వాత అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత తెలంగాణ రాజకీయాలు మరో మలుపు తిరగనున్నాయా? వేం నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ అవుతారా? లేక ఇంకా పెద్ద అవకాశం ఆయనను ఎదురుచూస్తుందా? అనే ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభించనుంది.

## సర్పంచ్ హత్య కేసులో ఆరోపణలు

- మంత్రి పదవికి ధనంజయ్ ముండే రాజీనామా



**ముంబైటీ మీడియా, మార్చి 4, :**

మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో సర్పంచ్ దారుణ హత్య వ్యవహారం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండే తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కేసు విషయంలో మంత్రి పదవికి రాజీనామా చేయాలని ధనంజయ్ ముండేను సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఆదేశించగా, తన రాజీనామాను సమర్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై స్పందించిన ఫడణవీస్, ముండే రాజీనామాను ఆమోదించి, గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపినట్లు తెలిపారు.ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గంలోని కీలక నేత అయిన ధనంజయ్ ముండే సొంత జిల్లా బీడ్‌లోని మసాజోగ్ గ్రామ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ ఇటీవల హత్యకు గురయ్యారు. ఆయనను కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ కేసును విచారించిన సీఐడీ, వాల్మీక్ కరాడ్‌ను నిందితుడిగా తేల్చింది. అతడిపై 1200 పేజీల అభియోగపత్రం దాఖలు చేసింది. సర్పంచ్‌ను హింసించి హత్య చేసినట్లు అందులో పేర్కొంది. నిందితుడు వాల్మీక్ కరాడ్, ధనంజయ ముండేకు అత్యంత సన్నిహితుడు. ఫలితంగా పౌరసరఫరాల శాఖను నిర్వహిస్తున్న ధనంజయను పదవి నుంచి తొలగించాలని డిమాండ్లు వచ్చాయి.మరోవైపు, మంత్రి ధనంజయ్ ముండేకు గట్టి మద్దతు ఇస్తున్న ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు, మంత్రికి వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను తాను సమర్పించినట్లు సామాజిక కార్యకర్త అంజలి దమానియా పేర్కొన్నారు. దీంతో ధనంజయ్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు మళ్లీ మొదలయ్యాయి. ఎన్‌సీపీ (శరద్ పవార్) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే సైతం ధనంజయ్ ముండే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ధనంజయ్ మాట్లాడుతూ, తనను మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్ లేదా డిప్యూటీ సీఎం అజిత్ పవార్ చెప్తే వెంటనే రాజీనామా చేస్తానన్నారు. దీనిపైఉపముఖ్యమంత్రి, ఎన్?సీపీ అధినేత ఏక్‌నాథ్ శిందేతో చర్చలు జరిపిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ రాజీనామా చేయాలని ధనంజయకు స్పష్టం చేసినట్లు సమాచారం. ధనంజయ పదవికి రాజీనామా చేయగా దాన్ని ముఖ్యమంత్రి ఫడణవీస్ ఆమోదించారు.

## సోలార్ విద్యుదుత్పత్తి

- అనుమతులను పునరుద్ధరించాలి
- కేంద్ర మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

**టీ మీడియా, మార్చి 4, ఢిల్లీ:**




తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ పథకం కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతు లను పునరు ద్ధరించాలని కేంద్ర ఆహార పౌర సరఫరాలు, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో 4 వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం, తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలాల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర మంత్రి గారికి వివరించి, గతంలో మంజూరు చేసిన 4 వేల మెగావాట్ల ఉత్పత్తి అనుమతులను పునరుద్ధరించాలని కోరారు.ముఖ్యమంత్రి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి గారిని కలిసి రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ అంశాలను వివరించారు. భారత ఆహార సంస్థకు 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. అప్పట్లో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనకింద మే 2021 నుంచి మార్చి 2022 వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకుని అందుకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని చెప్పారు. జూన్ 2021 నుంచి ఏప్రిల్ 2022 వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

# 4,870 రోజులు పనిచేయని బోరింగ్ మిషన్

### విద్యుత్తు బిల్లులు చెల్లించక 460 రోజులు
### 18 రోజులపాటు మాత్రమే పని

**టీ మీడియా,మార్చి 4,హైదరాబాద్ బ్యూరో :**



శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ)లో చిక్కుకున్న 8 మంది కార్మికుల కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్?ఎల్?బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీని గుర్తించేందుకు అధికారులు పలు విధాలా గాలింపు చర్యలు చేపడుతున్నా ఆచూకీ దొరకడం కష్టమవుతుంది. అయితే ఇక్కడ పనులు చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ మొదలుపెట్టారు. టన్నెల్ బోరింగ్ మిషన్ పనులు ఎస్ఎల్‌బీసీ పనులు జరగక ఆరు నెలలో సంవత్సరమో అనుకుంటే పొరపాటే. ఏకంగా 4,870 రోజులు టన్నెల్ బోరింగ్ మిషన్ పనే జరగలేదు. విద్యుత్తు బిల్లులు చెల్లించక 460 రోజులు సరఫరా నిలిపివేయడం జరుగింది. 2020-21, 2023-24లలో రెండు టీబీఎంలు ఒక్క రోజు కూడా పనిచేయలేదు. శ్రీశైలం నుంచి నీటిని తీసుకొనే(ఇన్‌లెట్) వైపు సొరంగం తవ్వే టీబీఎం(ప్రస్తుతంప్రమాదంజరిగింది) 2008-09నుంచి 2010-11వరకు, 2020-21 నుంచి 2023-24 వరకు ఒక్క రోజు కూడా పనిచేయలేదు. ప్రమాదం జరగడానికి ముందు ఈ ఏడాదిలో ప్రమాదం జరగడానికి ముందు 18 రోజులపాటు పనిచేసింది. భూసేకరణలో జాప్యం, టీబీఎంకు సరిపోయే పరికరాలు లభించకపోవడం, బేరింగ్‌లు దెబ్బతినడం, కన్వేయర్ బెల్టు పనిచేయకపోవడం, భారీ వర్షాలు, దెబ్బతిన్న మెయిన్ బేరింగ్ మళ్లీ తయారు చేయించడం ఇలా తరచూ ఏదో ఒక సమస్యను ఎదుర్కొని నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది.సంవత్సరాల తరబడి ఆగిపోయిన పనులు : శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) తవ్వి మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేసే ప్రాజెక్టు. 2005 ఆగస్టు 25న జయప్రకాశ్ అసోసియేట్స్‌తో రూ.1,925 కోట్లతో ఒప్పందం జరిగింది. ఇందులో 43.931 కి.మీ. దూరం టీబీఎం యంత్రాలను వినియోగించి, మరో 7.130 కి.మీ. దూరం సంప్రదాయ పద్ధతిలో సొరంగం తవ్వాల్సి ఉంది. సంప్రదాయ పద్ధతిలో తవ్వే సొరంగానికి ఎలాంటి ఇబ్బంది లేకపోయినా టీబీఎంతో చేపట్టే తవ్వకం పనులు మాత్రం సంవత్సరాల తరబడి ఆగిపోయాయి.టీబీఎం యంత్రాలతో పనులు : శ్రీశైలం అభయారణ్య ప్రాంతంలో సంప్రదాయ పద్ధతిలో సొరంగం తవ్వకానికి అటవీ అనుమతి వచ్చే అవకాశం లేక భూమికి 400 నుంచి 450 మీటర్ల దిగువన టీబీఎం యంత్రాలతో తవ్వకం పనులు చేపట్టారు. 10 మీటర్ల వ్యాసంతో టీబీఎం యంత్రం సొరంగం తవ్వి లైనింగ్ పూర్తయ్యాక 9.2 మీటర్ల వ్యాసంతో నీటి ప్రవాహానికి మార్గం సిద్ధమవుతుంది.2014 మే నెల వరకు నీటిని బయటకు వదిలే(ఔట్‌లెట్) వైపు నుంచి ఒక టీబీఎం యంత్రం 13.920 కి.మీ. తవ్వగా, ఇన్‌లెట్ వైపు ఇంకో టీబీఎం యంత్రం 8.970 కి.మీ. కలిపి మొత్తం 22.89 కి.మీ. దూరం పని జరిగింది. 2014 నుంచి ఇప్పటివరకు శ్రీశైలం వైపు నుంచి 4.985 కి.మీ., ఔట్‌లెట్ నుంచి 6.515 కి.మీ కలిపి 11.5 కి.మీ. పని జరిగింది. మొత్తం మీద రెండువైపులా కలిపి 34.39 కి.మీ. దూరం పూర్తయింది.పని జరిగిన దానికంటే జరగని రోజులే ఎక్కువ : 2005 ఆగస్టులో పనికి ఒప్పందం జరిగినా భూసేకరణ, టీబీఎం యంత్రం తయారీ, అమర్చడం ఇలా అన్నీ కలిపి పని ప్రారంభం కావడంలో జాప్యం జరిగింది. పని ప్రారంభించి సుమారు ఏడు వేల రోజులు కాగా, ఇన్‌లెట్ వైపు 4,870 రోజులు, ఔట్‌లెట్ వైపు 4 వేల రోజులు పని జరగలేదని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కలను పరిశీలిస్తే పని జరగని రోజులే ఎక్కువని స్పష్టమవుతోంది. ప్రారంభంలోనే అటవీశాఖ అనుమతి రావడంలో జాప్యంతో 700 రోజులు, తర్వాత డంపింగ్ యార్డు సమస్యతో 580 రోజులు పని ఆగిపోయింది. 2009లో కృష్ణాకు ప్రత్యేకించి శ్రీశైలానికి భారీ వరద వచ్చినపుడు ఏడాది పాటు పని నిలిచిపోయింది.

**విద్యుత్తు సరఫరాకు అంతరాయం :** అత్యధికంగా 2019 డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి వరకు 1,870 రోజులు పని ఆగిపోయింది. ఏ సంవత్సరం చూసినా జరిగిన రోజుల కంటే నిలిచిపోయిన రోజులే ఎక్కువ. శ్రీశైలం నుంచి సొరంగ మార్గం తవ్వే పనికి 460 రోజులు విద్యుత్తు సరఫరానే లేదు. 2019 జనవరి నుంచి 2022 ఏప్రిల్ వరకు తరచూ నిర్మాణ సంస్థ విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడం వల్లే ఈ 460 రోజులు సరఫరా లేదు. ఇంజినీర్లు జోక్యం చేసుకొని విద్యుత్తు అధికారులతో మాట్లాడి సరఫరా పునరుద్ధరించడం, మళ్లీ బిల్లు చెల్లించక ఆగిపోవడం ఇలా పదిసార్లకు పైగా జరిగింది. ఔట్‌లెట్ వైపు కూడా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగిన రోజులు 350కి పైగానే ఉన్నాయి. అన్ని రకాల సమస్యలు ఈ ప్రాజెక్టును వెంటాడటంతో నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది.

## అమరావతి, రుషికొండ భవనాలపై రగడ

### అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం

**టీ మీడియా, మార్చి 4,అమరావతి:**



ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు హాట్ హాట్‌గా జరుగుతున్నాయి. మంత్రి అచ్చెన్నాయుడు మాజీ మంత్రి, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య అటు వైసీపీ, ఇటు టీడీపీ ప్రభుత్వాల హయాంలో పాలన, అభివృద్ధిపై వాడివేడిగా చర్చ జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన పలు పథకాలపై ఇద్దరు నేతలు సవాళ్లు ప్రతి సవాళ్లు విసురుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చ పెట్టాలని బొత్స సత్యనారాయణ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా విశాఖ రుషికొండ భవనాల వ్యవహారం మీద అధికార విపక్షాల మధ్య మాటల మంటలు చెలరేగాయి. ఏపీలో అమరావతి రాజధాని ప్రాంతంలో తాత్కాలిక భవనాలకు పెద్ద ఎత్తున ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేశారని వైసీపీ ఎమ్మెల్సీలు విపర్శించారు. దీంతో అధికార కూటమి నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయింది. విశాఖలో రుషికొండ భవనాలకు ప్రజా ధనం దుర్వినియోగం చేయలేదా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.అయితే రుషికొండ భవనాల నిర్మాణంలో అవినీతి జరిగితే విచారణ ఎందుకు జరపడం లేదన్నారు వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. విచారణ జరిపించడానికి ప్రభుత్వం ఎందుకు ఆలోచిస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ, సెక్రటేరియట్ భవనాలు తాత్కాలికం కాకపోతే.. మళ్లీ టెండర్లు ఎందుకు పిలిచారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.మంత్రి అచ్చెన్నాయుడు బదులిస్తూ తమది కక్ష సాధింపు ప్రభుత్వం కాదని అందుకే వైసీపీ హయాంలో నిర్మాణాలు చేసినా బిల్లులు చెల్లించామని అన్నారు. అమరావతి సచివాలయం ఇతర భవనాలు తాత్కాలిక భవనాలు అని ఎవరు చెప్పారని అవి శాశ్వత భవనాలేనని అని అచ్చెన్నాయుడు బదులిచ్చారు.

# మల్కాజ్గిరి జిల్లాలో కాంగ్రెస్ మరింత బలోపేతం

### పార్లమెంట్ సమీక్ష సమావేశం

**టీ మీడియా, మార్చి4,మేడ్చల్ :**



ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి శ్రీమతి మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో గాంధీభవన్ లో జరిగిన మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్ష సమావేశంలో ఎఐసిసి సెక్రటరీ విష్ణునాథ్,టిపిసిసి అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ,టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ తో కలిసి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ సమీక్ష సమావేశంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే అంశలపై చర్చించారు.మన ప్రజా పాలన ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజా క్షేత్రంలో ఏవిధంగా ముందుకు తీసుకెళ్ళలో చర్చించారు.ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసమే మన కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందాని ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ సూచించారు

# ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**



మార్చి 31 చివరి నాటికి 25 శాతం రాయితీ తో ఎల్.ఆర్.ఎస్ చేయించుకొండి. ఎల్. ఆర్.ఎస్ లేని వారు మార్చి 31 తర్వాత ఇల్లు కట్టుకోవాలను కుంటే ఎలాంటి రాయితీ లేకుండా ప్రస్తుత మార్కెట్ వాల్యూ కు 14 శాతం పెనాల్టీతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.కచ్చా లేఅవుట్, ప్లాట్ ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ సదవకాశాన్ని కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.మార్చి 31 నాటికి కచ్చా లే అవుట్ లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఎల్.ఆర్.ఎస్ పై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం వనపర్తి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానర్ లు, లే అవుట్ రైటర్ లు, బిల్డర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. 2020 తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్నవారు జిల్లాలో 29 వేల మంది ఎల్.ఆర్.ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కేవలం 38 మంది మాత్రమే ముందుకు వచ్చి డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల ద్వారా దాదాపు 25 వేల మందికి నోటీస్ లు జారీ చేసినప్పటికీ ఫోన్ నెంబర్లలో తేడాలు, చిరునామాల్లో తేడాలు ఉండటం వల్ల అవి ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి చేరడం లేదన్నారు.లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిల్డర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సమాచారం, అవగాహన కల్పించి సకాలంలో ఎల్.ఆర్.ఎస్. చేయించుకునే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకు అవగాహన లేకపోవడం లేదా సమాచారం లేకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్.ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజు తో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. నిషేధిత స్థలం లేదా చెరువు , కుంట కింద లేకుంటే ప్లారు యజమాని ఫోన్ కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళుతుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్.ఆర్.ఎస్. తిరస్కరణకు గురి అయితే చెక్కించిన డబ్బుల నుంచి 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహా యించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేయడంజరుగుతుందనివివరించారు.ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్.ఆర్ ఎస్ ఉన్న ప్లాటు కు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లే అవుట్ ప్లానర్ లు ప్లాటు యజమానులతో సంప్రదించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలని కోరారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు బిల్డర్లు



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**టీ మీడియా, మార్చి 4, మేడ్చల్:**

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన కార్తీక్ (38) నిజాంపేటలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం నుండి తన వెర్నా కారులో భార్య సింధు కుమారుడితో బయలు బేరారు. ఉదయం 07.45 నిమిషాలకు ఓఆర్ఆర్ ఎక్సిట్ 5 దగ్గరకు రాగానే మేడ్చల్ నుండి మల్లంపేట వైపు వెళుతున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న కార్తీక్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. సింధు, కివిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం యశోదా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు దుండిగల్ సీఐ పి.సతీష్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇబ్బందులకు గురి చేయవద్దు

- హాల్ టికెట్స్ ఇవ్వని కళాశాల గుర్తింపు రద్దు

**టీ మీడియా,మార్చి 4,గోదావరిఖని :**




రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఇంటర్మీడియట్ కళాశాలలు హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోమని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు కొన్ని ప్రైవేట్ కళాశాలలు హాల్ టికెట్స్ ఇవ్వకుండా మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని,ఇలాంటి కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని విద్యాధికారులను ఆయన డిమాండ్ చేశారు.ఇంటర్మీడియట్ ప్రైవేటు కళాశాలల ఆగడాల గురించి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి దృష్టికి సోమవారం ఏఐఎస్ఎఫ్ గా తీసుకపోవడం వల్ల సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు.ఇంటర్మీడియట్ హాల్ టికెట్స్ ఇవ్వలేదని విద్యార్థులు బాధపడవద్దని గూగుల్ లో టీజీబీయి అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్,డేట్ అఫ్ బర్త్ అప్లోడ్ చేసి గెట్ హాల్ టికెట్ అని సర్చ్ చేసి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోగలరని ఆయన సూచించారు.హాల్ టికెట్ పై కళాశాలకు సంబంధించిన స్టాంపు లేకున్నా కూడా పరీక్ష రాసే అవకాశం ఇంటర్ బోర్డు కార్యదర్శి కల్పించారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఇంటర్మీడియట్ కళాశాలల తీరు మార్చుకొని విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వాలని , లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ కార్యదర్శి ఎల్కపల్లి సురేష్, కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్,న్యాతరి పవన్,గాజుల వినయ్, బూడిద శ్రీపాద,తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ మోర్చా పట్టణ కమిటీని ఎంపిక

- పట్టణాధ్యక్షుడు ఏ రాజశేఖర్ గౌడ్

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**

భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ మూర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బి శ్రీశైలం, పట్టణాధ్యక్షుడు ఏ రాజశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దంతోజు నవీన్ , ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఆగుపోగు చాణిక్య , ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు నల్లబోతుల రవి ఆధ్వర్యంలో ఎస్సీ మోర్చా పట్టణ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. పట్టణ ప్రధాన కార్యదర్శిగా మనగిల్ల వంశీ , ఉపాధ్యక్షుడిగా గుద్దేటి సురేష్, సహాయ కార్యదర్శిగా గంధ అరుణ్ కుమార్, గంధం శ్రీధర్ ను ఎన్నుకోవడం జరిగింది.

## శ్రీపాదరావు స్మారక అవార్డు

- అందుకున్న కనకం రమణయ్య

**టీ మీడియా,మార్చి 4,గోదావరిఖని :**




కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వారు ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభ స్పీకర్ కవి సాహితీవేత్త స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు 88వ జయంతి వేడుకలను కరీంనగర్ జిల్లా రంగినేని భవన్లో జరిగిన వేడుకలలో గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు గాయకులు సింగరేణి కోల్ ఇండియా స్థాయి కళాకారులు కనకం రమణయ్య ను,శ్రీపాదరావు స్మారక అవార్డుతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అతిథులు కుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫోక్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు గుండ్ర కృపాదానం,చేతుల మీదుగా ఈ అవార్డును కనకం రమణయ్యకు అందించినారు.ఎంపిక చేసి అవార్డును అందజేసినందులకు ఫోక్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు కృపాదానం కు కనకం రమణయ్య కృతజ్ఞతలు తెలియజేసినారు.సింగరేణి అధికారులు ఉద్యోగులు కార్మిక నాయకులు స్థానిక కళాకారులు కనకం కుటుంబ సభ్యులు రమణయ్యకు శు భాకాంక్షలు తెలియజేసినారు.




## సిఐ గడ్డం మల్లేష్‌కి స్పెషల్ జూరి అవార్డు

**టీ మీడియా, మార్చి 4, మేడ్చల్ :**

ఢిల్లీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వారు ఏర్పాటు చేసిన , స్మార్ట్ పోలీసింగ్ అవార్డు లో భాగంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బాల్నగర్ జోన్ జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్ స్పెషల్ జూరి అవార్డు అందుకున్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్ మేనేజ్మెంట్ అనే విభాగంలో దాదాపు దేశవ్యాప్తంగా 129 ఎంట్రీస్ వివిధ రాష్ట్రాలు పోలీస్ విభాగాలు సెంట్రల్ పోలీస్ ఫోర్సెస్ నుంచి రాగా అందులో నాకు స్పెషల్ జూరి అవార్డు రావడం జరిగింది అన్నారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషకరమని అన్నారు అలాగే ఈ అవకాశం ఇచ్చినటువంటి తమ ఉన్నతాధికారులు రాష్ట్ర డీజీపీ జితేందర్ అలాగే సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి బాలానగర్ డీసీపీ కొల్లు సురేష్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ఇంగ్లీష్ ఫెయిర్‌ను ప్రారంభించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ చక్ర హైస్కూల్ నందు ఇంగ్లీష్ ఫెయిర్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాకిటి శ్రీధర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వనపర్తి పట్టణ టీజీఎస్పిడిసిఎల్ ఏఈ రాజయ్య గౌడ్, కరస్పాండెంట్ వెంకటేష్ కార్యక్రమాని ప్రారంభించారు.శ్రీ చక్ర హై స్కూల్ ఎన్టీఆర్ కాలనీ వనపర్తి నందు సిఎఫ్ఈఎల్ సెంట్రీ ఫర్ ఎడ్యుకేషన్ లెర్నింగ్ ఇంగ్లీష్ ప్రోగ్రాం నిర్వహించారు. స్కూల్ యొక్క విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ ప్రావీణ్యతను ప్రతిభను ప్రదర్శించారు. స్పోకెన్ ఇంగ్లీష్ యొక్క ప్రాధాన్యతను మాట్లాడే విధానాన్ని, చక్కటి సంభాషణతోన మెపొందించారు. యూకేజీ క్లాసెస్ పిల్లలు పెద్ద తరగతి లోన ఉన్న సృజనాత్మకమైన విధానాన్ని పెంపొందించడం ఇలాంటి కార్యక్రమాలతోనా పిల్లలను ఎంతో చైతన్య మంత్రం చేయగలుగుతాం వాళ్ళంలోనే ఉన్నటువంటి ఉన్నత విలువలను , వాళ్ళ లోన తెలివితేటలను ఎంతో తోడ్పడతాయని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన శ్రీ చక్ర హైస్కూల్ యజమాన్యానికి వాకిటి శ్రీధర్ ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు.

## ఆయాల వేతనాలు విడుదల చేయాలి

- సిడిపిఓ కార్యాలయం ధర్నా

**టీ మీడియా, మార్చి 4 ,ఆత్మకూరు :**



2021 జులై నెల నుండి డిసెంబరు వరకు అంగన్వాడి ఆయాలకు పెండింగ్ లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం సిడిపిఓ నాగరాజు కు వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా సిఐటియు వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ 2021 సంవత్సరం నుండి జులై నెల డిసెంబర్ వరకు ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలోని కొత్తకోట మదనపురం అమరచింత మండలాల్లో పనిచేస్తున్న పదిమంది ఆయాలకు ఐదు నెలపాటుగా వేతనాలు విడుదల చేయకపోవడంతో ఆందోళన గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు వేతనాలు పెండింగ్లో ఉన్నాయి విడుదల చేయాలని పలుమార్లు ఆత్మకూరు సిడిపిఓ కు జిల్లా అధికారి డి డబ్ల్యూ కు వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేకుండా పోతుందని ఆయన విమర్శించారు. దాదాపుగా మూడు సంవత్సరాల నుండి వేతనాలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆయన అన్నారు 2024 సంవత్సరం మార్చి నుండి 2025 జనవరి నెల వరకు మినీ అంగన్వాడి టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించిన వారికి పది నెలపాటు వేతనాలు పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా వెంటనే అమలు చేయాలని కోరారు. సామాజిక వర్గమైన ఎస్సీ ఎస్టీలు చెందినవారికి పెండింగ్ వేతనాలు విడుదల చేయడంలో అధికారులు మొండి వైఖరి మానుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అరుణ గాయత్రి, రామేశ్వరి మనిషా, శిరీష,రాజేశ్వరి ప్రేమలత,సైదాబీ హుస్సేన్, బి జయమ్మ అనిత, కవిత, మధురిమ ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 401 దరఖాస్తులు అందాయి.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60, విద్యుత్ శాఖకు సంబంధించి 38, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 40, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 216 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 47 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ దాక్టర్ జీ. చిన్నా రెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబందిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు.

## మున్సిపల్ బడ్జెట్‌ను ఆమోదించిన జిల్లా కలెక్టర్

- 45.11 కోట్ల వార్షిక అంచన

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**




2025-26 ఆర్థిక సంవత్సరంలో వనపర్తి పురపాలికలో రూ. 45.11 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు వేసిన అంచనా బడ్జెట్ ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆమోదించారు. ఇందులో మున్సిపాలిటీలో వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు 15వ. ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్ నిధులు ఉన్నాయి.మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలక్టర్ అధ్యక్షతన 2024-25 సవరించిన బడ్జెట్, ఇప్పటి వరకు అయిన ఖర్చులు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ అకౌంటెంట్ కృష్ణయ్య బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 26.36 కోట్ల అంచనా బడ్జెట్ ను ప్రతిపాదించగా 2025 సవరించిన బడ్జెట్ విలువ రూ. 39.28 కోట్ల ఆదాయంగా పద్దులో చూపించారు. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 11.67 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 45.11 కోట్ల ఆదాయం వివిధ మార్గాల ద్వారా సమకురనున్నట్లు అంచనా వేశారు. ఇందులో 10 శాతం నిధులు మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు గ్రీన్ బడ్జెట్ గా కేటాయించినట్లు చూపించారు. 1/3 వంతు బడ్జెట్ ను పురపాలక సంఘంలోని విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, మైనారిటీ, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలు, మురికి వాడల అభివృద్ధికి వాడనున్నట్లు పేర్కొన్నారు.పురపాలికలోని 33 వార్డుల అభివృద్ధి కొరకు దాదాపు 22.26 కోట్లు కేటాయించారు. అంటే ఒక్కో వార్డుకు దాదాపు 60 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. వీధి కుక్కల నియంత్రణ ఏ.బి.సి చేసేందుకు రూ.15 లక్షలు కొత్త బడ్జెట్ లో కేటాయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిధులు సమకూర్చుకుంటేనే అభివృద్ధి సాధించవచ్చని సూచించారు. అన్ని పురపాలికల్లో ప్రాపర్టీ ట్యాక్స్ వంద శాతం వసూలు చేసేందుకు కృషి చేయాలని, అదేవిధంగా కుళాయి బిల్లులు,ఎల్.ఆర్.ఎస్ చేయించడం పై పూర్తి దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీ యాదయ్య వనపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, పెబ్బేరు మున్సిపాలిటిల కమిషనర్లు సైతం పాల్గొన్నారు.




## కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

**టీ మీడియా,ఫిబ్రవరి 4,గోదావరిఖని :**

కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించి,కనీస వేతనం 26000/-రూ అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ7 వరకు జరపతలపెట్టిన కనీస వేతనాల క్యాంపెయిన్ లో భాగంగా సిఐటియు అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రామగుండం ఏరియా -1 లో మంగళవారం ఉదయ్ నగర్ జోన్,సూర్యనగర్, జీ.ఎం.కాలనీ లలో కరపత్రాలు విడుదల చేసి,అడ్డా మీటింగ్స్ నిర్వహించడం జరిగింది.ఈ అడ్డా మీటింగ్ కు ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ హాజరై ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై .6న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులను కోరారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి, ఆర్జి-1అధ్యక్షకార్యదర్శులు నందిని,ఉపేందర్, ఉపాధ్యక్షులు రాజు, కార్మికులు దీక్ష కుమారి, రాజేశ్వరి,జయలక్ష్మి,స్వరూప,మమత,జయ,సునీత,మరియమ్మ,వెంకటేష్, పోషమ్మ,మీన,శారద,కోమురమ్మహరి,శేఖర్,కొమురయ్య,ఈశ్వర్,మల్లయ్య,కృష్ణవేణి,రమణమ్మ,ఆనంద్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారెడ్డితో సర్పంచుల సంఘం జే.ఏ.సీ భేటీ

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**



సర్పంచుల సంఘం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన ఈ భేటీలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సర్పంచుల సమస్యలపై స్పందించిన చిన్నారెడ్డి వారి వినతి పత్రంపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఎండార్స్మెంట్ చేశారు.

## ఎమ్మెల్సీగా మల్క కోమరయ్య

- గెలుపుపై బీజేపీ విజయోత్సవాలు

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**




తెలంగాణ రాష్ట్రంలో గతవారం జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి సభ్యులుగా భారతీయ జనతా పార్టీ మద్దతుతో పోటీ చేసిన మల్క కొమరయ్య భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల బిజెపి పట్టణ కమిటీ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ చౌరస్తాలో మిఠాయిలు పంచి బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా గెలుపొందేది మాత్రం భారతీయ జనతా పార్టీ యేనని, కాంగ్రెస్ పార్టీ గెలిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అధికార పార్టీకి దిటుగా గెలుపొందామని తాజాగా జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ -నిజామాబాద్- అదిలాబాద్ -మెదక్ జిల్లాల శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థి మల్క కొమరయ్య భారీ మెజార్టీతో గెలిచారని, ఉమ్మడి మెదక్-కరీం నగర్- ఆదిలాబాద్ నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో కూడా బిజెపి మద్దతుతో పోటీ చేసిన చిన్నమైల్ అంజి రెడ్డి గారు రౌండ్ రౌండ్ కు ఆధిక్యంలో దూసుకు పోతున్నారని ఆ స్థానంలో కూడా బిజెపి గెలుస్తుందని తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీని మట్టికరిపించి గెలిచేది భారతీయ జనతా పార్టీ అని జోస్యం చెప్పారు.ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి టౌన్ ఇన్చార్జి బి.శ్రీశైలం ఓ బి సి మోర్చా కోఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్ ఉపాధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర రెడ్డి మాజీ పట్టణ అధ్యక్షులు బచ్చు రాము ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు కుమార్ జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేష్ సీనియర్ నాయకులు ధ్యారపొగు సుబ్రహ్మణ్యం, ద్యారపోగు నారాయణ, బొడ్డుపల్లి వెంకటేష్ పీఎం రాము మోహన్ సాగర్ ప్రధాన కార్యదర్శి దంతోజు నవీన్ సుగురు రాములు నల్లబోతుల రవి శ్రీకాంత్ చాణక్య ఉందే కోటి నాగరాజ్ రాయన్న హర్ష శ్రీకాంత్ అనిల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు భద్రత కట్టుదిట్టమైన భద్రత

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**



ఈ నెల5 వ తేది నుండి 25 వ తేది వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే.ఆ నేపథ్యంలో వనపర్తి జిల్లాలో మొత్తం 25 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరగనున్నట్లు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు.ఈ పరీక్షలు జరుగుతున్న తేదీలలో ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్- 2023 (144) సిఆర్పిసీ చట్టం అమల్లో ఉంటుంది. పరీక్షలు జరుగు సమయంలో సమీపంలో ఆయా పట్టణాలలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసి వేయాలని, పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ కూడదని తెలిపారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసు అధికారులు , సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటారని పోలీస్ అధికారులు పరీక్ష సమయంలో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ స్టేషన్లో నుండి పరిక్షా పత్రాలు పరిక్షా. కేంద్రానికి వెళ్ళే సమయంలో కానిస్టేబుల్ తప్పనిసరిగా ఎస్కార్ట్ వుండాలని సూచించారు. పరిక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షా సమయానికే గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎస్పీ విద్యార్థులకు సూచించారు.

# సంక్షోభంలో వ్యవసాయ రంగం

- సానుభూతి లేకుండా వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**టీ మీడియా, మార్చి 4, నెల్లూరు :**
రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం సానుభూతి లేకుండా వ్యవహరిస్తోందని చెప్పారు. మంగళవారం ఆయన నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్లో విలేకర్లతో మాట్లాడారు. ఒకవైపు కరువు, మరోవైపు వర్షాభావం వల్ల పంటల దిగుబడి తగ్గిపోయిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించలేదన్నారు. నెల్లూరు జిల్లాలో గతేడాది పుట్టి (85 కిలోల) ధాన్యానికి రూ.22 వేలుకుపైగా ధర వచ్చేదని, ప్రస్తుతం రూ.17 వేలు మాత్రమే వస్తోందని, రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పుట్టి ఒక్కంటికీ రూ.5 వేలు, ఎకరా ఒక్కంటికీ రూ.10 వేలు నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు. అయినా, ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ధాన్యం ధర గతేడాది కంటే ఈ ఏడాది ధర రూ.5 వేలకు తగ్గడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు రైతులకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాల్లో పర్యటించి, రైతులతో మాట్లాడి వారి కష్టనష్టాలు తెలుసుకోకుండా మంత్రి అసెంబ్లీలో ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. గ్రామాలను సందర్శించకుండా, రైతులతో




మాట్లాడకుండా అసెంబ్లీలో ప్రకటనలు చేస్తే వ్యవసాయంలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించలేమన్నారు. మిర్చి రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. గతేడాది క్వింటాలు రూ.23 వేలు పలికిందన్నారు. ఈ ఏడాది రూ.9 వేలు నుంచి రూ.10 వేలుకు అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల కళ్లల్లో నీళ్లు రప్పిస్తోందన్నారు. రైతులకు టమాటాకు కిలో ఒక్కంటికి రూ.3 మాత్రమే దళారులు చెల్లిస్తున్నారని తెలిపారు. దీనివల్ల టమాటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. శనగ, పత్తి, పొగాకు ధరలు కూడా గతేడాదితో పోలిస్తే గణనీయంగా పడిపోయాయన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఏమి చేయనుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్లో ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్ల మాత్రమే కేటాయించారని, ఈ మొత్తం ఏ మూలకూ చాలదని తెలిపారు. ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.2 వేల కోట్లు కేటాయించిందన్నారు. పేదల సంక్షేమ పథకాల్లో కోత, రైతులకు నిధుల కోత, వ్యవసాయ రంగానికి నిధుల్లో కోత%ౌ% ఇలా కోతలు, వాతలు ప్రజలకు, బహుమతులు, నజరానాలు కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వం ఇస్తోందని వివరించారు. పోలవరం నిర్వాసితులకు ఈ బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాటల గారడీతో ప్రజలను మభ్య పెడుతోందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు వరాలు కురిపించిన ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులకు మేలు చేకూర్చాలనే ఆలోచనతో ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఎన్నిక హామీల విస్మరణ తగదన్నారు. టిడిపి కూటమికి ప్రజలు అధికారం ఇచ్చింది గత ప్రభుత్వ విధానాలను అమలు చేసేందుకేనా? అని ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీల భారాలు మోపడం తగదన్నారు. దీనిని, స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. అదాని ప్రయోజనాల కోసమే గత ప్రభుత్వం విద్యుత్ ఒప్పందం కుదుర్చుకుందని, దీన్ని టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగించడం తగదని అన్నారు. ఎంఎల్సి ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వ తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేసేదిగా ఉందని వివరించారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీ నుంచి సిపిఎం ఆధ్వర్యాన ప్రజాచైతన్య యాత్ర చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎవి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్సు బోల్తా

- 20 మందికి గాయాలు

**టీ మీడియా, మార్చి 4, కొలిమిగుండ్ల :**
నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కలవటాల సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. బస్సు జమ్మలమడుగు నుంచి తాడిపత్రికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్, కండక్టర్ సహా 20 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. ఎవరికీ ప్రాణాపాయం లేనట్లుగా వైద్యులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సు డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుతున్నారని, వద్దని వారించినా వినలేదని ప్రయాణికులు తెలిపారు.ప్రమాదంపై ఆరా తీసిన మంత్రి మండిపల్లి: ఆర్టీసీ బస్సు బోల్తా ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. గాయాలపాలైన 20 మంది క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షణపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. క్షతగాత్రులకు బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల ఆస్పత్రులలో మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఘటనపై ఆర్టీసీ అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఫోన్?లో వివరణ కోరారు.



## అభివృద్ధి పనులను పరిశీలించిన ఏమ్మెల్యే రాజ్ ఠాకూర్

**టీ మీడియా,మార్చి 4,గోదావరిఖని :**
లక్ష్మీ నగర్ ప్రాంతంలో రోడ్లు,డ్రైనేజీలు,లైటింగ్, వాటర్ లైన్,జరుగుతున్న పనుల వల్ల కొంత ఇబ్బంది పడ్డ పూర్తిస్థాయిలో రాబోయే తరాల భవిష్యత్తు కోసం ఆలోచించి 30 నుండి 40 సంవత్సరాల వరకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు నడవడం జరుగుతుంది.సోమవారం రామగుండం ఏమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు.ఈ యొక్క లక్ష్మీ నగర్ ను ఇంకా అద్భుతంగా చేసే విధంగా దృష్టిలో పెట్టుకొని లక్ష్మీ నగర్ ప్రాంత వ్యాపారస్తుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరుగుతుంది.సుమారుగా 6 నుంచి 7 నెలల పనులు మొదలై తర్వాత అన్ని ప్రాంతాలలో రోడ్లు డ్రైనేజీ విషయంలో పర్యటిస్తూ చిన్న పైపునుండి మొదలు పెట్టుకున్నట్లయితే పెద్ద స్థాయిలో ఉన్న పనులను కూడా భవిష్యత్ తరాల కోసం ఆలోచనతో ముందుకు వెళ్తున్నాం.గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలననే రామగుండం నియోజకవర్గం మరియు అందులో భాగంగా లక్ష్మీ నగర్ ప్రాంతంలో అభివృద్ధి వెనుక పడడం కారణం గత పాలకుల నిర్లక్ష్యం అనేసి ప్రజలు అధికారులు చెప్తా ఉన్నారు.ఎన్నడు లేనివిధంగా ఎక్కడ లేని విధంగా పకడ్బందీగా పనులు జరుగుతున్నాయి దయచేసి లక్ష్మీ నగర్ ప్రాంత ప్రజలు మరియు రామగుండం నియోజకవర్గం ప్రజలు వ్యాపారస్తులు ప్రతి ఒక్కరు కూడా జరిగే అభివృద్ధి కార్యక్రమాలను సహకరించి ఈ రాష్ట్రంలో రామగుండం నియోజకవర్గంనికి ముందు భాగంలో ఉండే విధంగా చేసుకొని బాధ్యత మన అందరి పైన ఉందని తెలియజేశారు.రోడ్లను లక్ష్మీ నగర్ ప్రాంతంలో ఉన్నటువంటి వ్యాపారస్తులు ఎవరైనా కానీ ఇతర పనుల కోసం రోడ్లను పగలగొట్టే ప్రయత్నం చేస్తే మున్సిపల్ అధికారులు ఐదు లక్షల రూపాయలు జరిమానా వేస్తారు ఈ రోడ్లను కాపాడుకునే బాధ్యత మీ అందరి పైన ఉంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

## అభయారణ్యంలో ఎలివేటెడ్ కారిడార్

- కేంద్రం గ్రీన్ సిగ్నల్

**టీ మీడియా, మార్చి 4, ఢిల్లీ:**
తెలుగు రాష్ట్రాల మధ్య హైదరాబాద్-విజయవాడ హైవే తర్వాత ఎక్కువగా హైదరాబాద్-శ్రీశైలం హైవేపై రాకపోకలు సాగిస్తుంటారు. రాయలసీమ ప్రాంతానికి వెళ్లేవారితో పాటుగా.. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లేవారు ఈ హైవే పైనే వెళ్తుంటారు. ఈ రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ మార్గాన్ని విస్తరించేందుకు డిసైడ్ అయ్యారు. 125 కిలోమీటర్ల పొడవుతో ఉన్న ఈ జాతీయ రహదారి.. నల్లమల ఫారెస్ట్ అమ్రాబాద్ పులుల అభయారణ్యం మీదుగా వెళ్లనుంది. ఇందులో 62 కిలోమీటర్ల దూరం రెండు లేన్ల ఘాట్లతో ఇరుకుగా ఉంది. దీంతో ప్రస్తుతం వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవతున్నాయి. ఈ ప్రాంతంలో టర్నింగ్‌ల కారణంగా.. వన్యప్రాణులు కూడా యాక్సిడెంట్ బారిన పడుతున్నాయి. దానికి తోడు హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి దూరం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టారు. ఈ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



**ప్రాజెక్ట్ వివరాలు**
హైదరాబాద్ టు శ్రీశైలం రోడ్ వయా నల్లమల ఫారెస్ట్,మొత్తం 62 కిలోమీటర్ల మేర అభయారణ్యంలో 30 అడుగుల ఎత్తులో ఈ కారిడార్ నిర్మించనున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.7,700 కోట్ల ఖర్చవుతుందని అంచనా,నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బ్రాహ్మణపల్లి నుంచి శ్రీశైలం వరకు కారిడార్ వెళు ‿ంది.శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు, శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో ప్రత్యేక ఆకర్షణగా ఐకానిక్ వంతెనను కూడా నిర్మించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 370 ఎకరాల భూమి అవసరం.వన్యప్రాణులకు ఇబ్బందులు లేకుండా.. వృక్ష సంపదకు నష్టం కలుగకుండా భూసేకరణకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తయి.. అందుబాటులోకి వస్తే.. ప్రయాణ ఇబ్బందులు దూరంప్రస్తుతం రాత్రి వేళల్లో అభయారణ్యంలో వాహనాలపై నిషేధం ఉంది. 30 అడుగుల ఎత్తులో ఉండే కారిడార్ వల్ల.. ఆ నిషేధాన్ని ఎత్తివేయవచ్చు.30 అడుగుల ఎత్తులో కారిడార్ ఉండడం వల్ల.. వన్యప్రాణులకు రోడ్డు ప్రమాదాల నుంచి భద్రత కలుగుతుంది.ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత శ్రీశైలం ప్రాంతం రవాణా, పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.రోడ్డును విస్తరించాక ఎలివేటెడ్ కారిడార్ మీదుగా వాహనాలు 24 గంటలు రాకపోకలు సాగిస్తాయని అధికారులు తెలిపారు. అయితే ఫ్లైఓవర్ మధ్యలో వాహనాలు ఎక్కి, దిగేలా ర్యాంపులు నిర్మించొద్దని అటవీశాఖ సూచించింది. లైటింగ్ అధికంగా ఉంటే వన్యప్రాణులకు ఇబ్బంది కలుగుతుందని ఎలివేటెడ్ కారిడార్‌పై రాత్రివేళ తక్కువ లైటింగ్ పెట్టాలని, నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు మార్గదర్శకాల ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. మొత్తంగా హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లేవాళ్లతో పాటు, ఏపీకి వెళ్లేవాళ్లకు కూడా ఈ కారిడార్ వల్ల సమయం కలిసి వస్తుంది.



## మినీ అంగన్ వాడి టీచర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రజావాణి ఇంచార్జ్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య హామీ

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**
రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న నాలుగు వేల మంది మినీ అంగన్ వాడి టీచర్ల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ హామీ ఇచ్చారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ కు రాష్ట్రంలోని మినీ అంగన్ వాడి టీచర్స్ భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాన్ని చిన్నారెడ్డి, దివ్యకు అందజేశారు. మినీ అంగన్ వాడి టీచర్స్ కు హెల్పర్స్ ను నియమించాలని, పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనాల పెంపు హామీలను నిలబెట్టుకోవాలని వంటి పలు అంశాలను పరిష్కరించాలని మినీ అంగన్ వాడి టీచర్స్ వినతి పత్రంలో కోరారు. ఈ హామీలపై చిన్నారెడ్డి, దివ్య సానుకూలంగా స్పందించారు.

## ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు పరీక్ష రాయాలి

**టీ మీడియా, మార్చి 4, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో మార్చి 5 తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి . మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల సమయం కాబట్టి ఎటువంటి ఒత్తిడి గురి కాకుండా ప్రతి ఒక్కరూ బాగా చదివి సరైన సమయానికి పరీక్ష కేంద్రాలకు జాగ్రత్తగా వెళ్లి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి వనపర్తి జిల్లాకు గుర్తింపు తేవాలని మనస్ఫూర్తిగా కోరారు.





## అసెంబ్లీలో పాన్ మసాలా ఊసిన ఎమ్మెల్యే

- స్వయంగా శుభ్రం చేసిన స్పీకర్

**టీ మీడియా, మార్చి 4,లక్నో :**
ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆసక్తికరమైన ఉదంతం జరిగింది. అసెంబ్లీ హాలులో ఓ ఎమ్మెల్యే ఊసిన పాన్ మసాలాను స్పీకర్ సతీష్ మహానా సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అనంతరం ఆయన సభలో చేసిన ఓ ప్రకటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. సెషన్ ప్రారంభమైన వెంటనే స్పీకర్ సతీష్ మహానా సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ ఉదయం విధాన సభ హాల్‌లో జరిగిన ఓ ఘటన గురించి మీకు చెప్పాలి. సభ్యుల్లో ఒకాయన పాన్ మసాలా నమిలి ఉమ్మేశారు. విషయం తెలియగానే నేనే స్వయంగా వెళ్లి అక్కడ శుభ్రం చేశా. ఆ ఎమ్మెల్యే ఎవరనేది ఆ వీడియోలో నేను చూశా. కానీ, నేను పేరు చెప్పి ఒక గౌరవ సభ్యుడి పరువు తీయాలని అనుకోవడం లేదు. తనంతట తానుగా ఆయన నా దగ్గరకు వచ్చి వివరణ ఇచ్చుకుంటే మంచిది. లేకుంటే నేనే పిలవాల్సి ఉంటుంది. ఈ సమయంలో దయచేసి మీ అందరికీ ఓ విజ్ఞప్తి. ఇక మీదట అలా ఎవరైనా చేస్తుండడం మీరు గమనిస్తే.. వాళ్లను అడ్డుకోండి. ఎందుకంటే.. అసెంబ్లీని శుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ విషయం చెప్పగానే సభలోని ఎమ్మెల్యేలంతా తలలు దించుకున్నారు.

## రెండోరోజు కొనసాగిన భూ పోరాటం

- వెళ్లిపోవాలని పోలీసుల ఒత్తిడి
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



**టీ మీడియా, మార్చి 4,కర్నూలు :**
పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కర్నూలు జిల్లా కల్లూరు మండలం పరిధిలోని పెద్దపాడు గ్రామ శివారులో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు చేపట్టిన భూ పోరాటం మంగళవారం రెండో రోజు కొనసాగింది. పేదలకు న్యాయం చేస్తామని, దరఖాస్తులు ఇవ్వాలని సోమవారం కల్లూరు తహశీల్దారు ఇచ్చిన హామీ మేరకు రెండవరోజు నగరంలోని వేలాదిమంది పేదలు దరఖాస్తులు చేతపట్టుకుని పెద్దపాడు గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల వద్దకు వచ్చారు. అయితే అప్పటికే అక్కడ పోలీసులు భారీగా మోహరించారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, తహశీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లిపోవాలని పోలీసులు బలవంతం చేశారు. చంటి బిడ్డలతో మండుటెండల్లో వచ్చిన మహిళలు అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయానికి దరఖాస్తులతో చేరుకున్నారు. పేదలతో కలిసి సిపిఎం నాయకులు తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు. పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని నినాదాలు చేశారు. దరఖాస్తులను తీసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. తహశీల్దారు స్థానికంగా లేకపోవడంతో డిప్యూటీ తహశీల్దారు, విఆర్‌ఒలు దరఖాస్తులు స్వీకరించారు. ఇంటిస్థలాల దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారని సమాచారం తెలియడంతో నగరంలోని పేద ప్రజలు వేలాదిగా తరలివచ్చి దరఖాస్తులను అందజేశారు. దీంతో తహశీల్దార్ కార్యాలయం ఒక్కసారిగా కిక్కిరిసిపోయింది.అంతకుముందు జరిగిన ధర్నా కార్యక్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. ఈ హామీ మేరకు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తాము కోరుతున్నామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్‌దేశారు మాట్లాడుతూ%ౌ% పేదలకు పట్టాలిచ్చేంత వరకూ వంటావార్పు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిఎస్ రాధాకృష్ణ, పి.నిర్మల, టి.రాముడు, జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, అలివేలమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టు దగ్గర టెన్షన్.. టెన్షన్..

- నిలిచిపోయిన భూసేకరణ సర్వే..

**టీ మీడియా, మార్చి 4, మామునూరు :**
ఎయిర్‌పోర్ట్ కోసం భూములు కోల్పోతున్న రైతులు ఆందోళనకు దిగారు. మామునూరు ఎయిర్‌పోర్టు రావడం సంతోషకరమే అయినా భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మాములూరుకు సమీపంలో ఉన్న గవిచర్ల క్రాస్ రోడ్డు మీదుగా నక్కలపల్లి, గుంటూరుపల్లి, నెక్కొండ వెళ్లే ప్రధాన రహదారి మొత్తం ఎయిర్‌పోర్టులో కలిసిపోతుంది. దీంతో రహదారి మూసివేస్తుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎయిర్‌పోర్టు రావడం వల్ల ఎంతైతే లాభపడుతున్నామో.. అంతకంటే ఎక్కువ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాకపోవడంతో ధర్నాకు దిగినట్లు తెలిపారు. రైతుల ఆందోళనతో మామూనూరు ఎయిర్‌పోర్టు దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. భూసేకరణ సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను రైతులు, వారి కుటుంబాలు అడ్డుకున్నాయి. దీంతో భూసేకరణ సర్వే తాత్కాలికంగా నిలిచిపోయింది.మరోవైపు మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి భూములు కోల్పోతున్న



రైతులు సహకరించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా భూమిని కోల్పోయిన గాడేపల్లి, గుంటూరు పల్లి రైతులతో రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశం నిర్వహించారు. భూ సర్వేకు సహకరించాలని, భూమి కోల్పోతున్న రైతులకు ఆమోదయోగ్యమైన పరిహారాన్ని ఇప్పిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎయిర్‌పోర్టు నిర్మాణం ఆగదని స్పష్టం చేశారు.ఇదిలా ఉంటే సాధ్యమైనంత తొందరగా ఎయిర్‌పోర్టు కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు మొదలయ్యేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో రైతులతో మాట్లాడి వారిని ఒప్పించేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారు.


మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
Spot Speed NEWS
epaper,www.tmedia.net.in YouTube facebook